ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 22 ఫిబ్రవరి 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 23.0



ఓట్లు బదిలీ కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పవన్, చిత్రంలో గోవిందరావు

» సమస్యలుంటే చెప్పండి : టీడీపీ నేతలతో జనసేనాని పవన్‌కల్యాణ్

» గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి : పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం

భీమవరం/టౌన్/అర్బన్, ఫిబ్రవరి 21 : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ భీమవరం పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. భీమవరం నుంచి ఆయన పోటీ చేస్తారని చర్చ సాగుతున్న నేపథ్యంలో ఆయన ఒకరోజు పర్యటనకు రెండు పార్టీల అభిమానుల్లో ఉత్సాహం కనిపించింది. వందలాది మంది యువకులు, నాయకులు కార్లు, బైక్‌లపై పవన్‌ను అనుసరించారు. నినాదాలు చేస్తూ కల్యాణ్ బాబు సీఎం, సీఎం అంటూ నినాదాలు, కేరింతలు కొట్టారు. బుధవారం ఉదయం హెలికాప్టర్‌లో భీమవరం చేరుకుని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి నివాసానికి వెళ్లి దాదాపు గంటపాటు ఆమె కుటుంబ సభ్యులు సత్యనారాయణ, జగదీష్ తదితరులతో మాట్లాడారు. అనంతరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, ఆరిమిల్లి రాధాకృష్ణ, పొత్తూరి రామరాజు, అంగర రామ్మోహన్, వేటుకూరి శివరామరాజు తదితరులు పవన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో ప్రస్తుత రాజకీయాలు, పొత్తులపై చర్చించారు. టీడీపీ-జనసేన పార్టీల మధ్య ఓటు మార్పిడి జరగాలని పవన్ ఆకాంక్షించారు. జనసేన పార్టీతో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. 'అధికారంలోకి రావడానికి ఇరు పార్టీలు కలిసికట్టుగా కృషి చేయాలి. మండలాలు, గ్రామాల వారీగా రెండు పార్టీలు సమావేశాలను ఏర్పాటు చేసుకుని సమన్వయ పరచుకోవాలి' అని కోరారు. రెండు పార్టీలు కలిసి ఉమ్మడి పశ్చిమలోని 15 నియోజకవర్గాలు గెలిచి తీరుతామని ఇన్‌చార్జ్‌లు పవన్ దృష్టికి తీసుకువెళ్లారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వెళదామని జనసైనికులకు పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేశారు. పెద అమిరంలోని నిర్మల ఫంక్షన్ హాల్‌లో బుధవారం పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'భీమవరంలో పోటీ చేయాలని 2019లో కొందరు ఆహ్వానించారు. ఇక్కడ పోటీ చేయాలన్న ఆలోచన నాకు లేదు. కొందరు నాయకుల ఆహ్వానం మేరకే ఇక్కడకు వచ్చాను. వారంతా ఇప్పుడు పార్టీలో లేరు. తులసి నా పక్కనే ఉండేవారు. ఎమ్మెల్యే కుమారుడికి నా కుమార్తెను ఇచ్చాను. అతనికి ఏమీ అనవద్దంటూ తులసి చెప్పేవారు. ఇలా నా కాళ్లకు బంధాలు వేశారు. నిస్సత్తువ వచ్చేసింది. ఓటమి చవి చూడాల్సి వచ్చింది' అంటూ పవన్ గత అనుభవాలను పంచుకున్నారు. ప్రతీచోట గెలుపే లక్ష్యంగా ముందుకు వెళదామని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. జగన్ ప్రభుత్వ వైఖరి, ప్రభుత్వ విధానాలు, తెలుగుదేశం పార్టీతో ఎందుకు కలిసి వెళ్లాల్సి వస్తోంది అనే అంశాలపై ఆయన వివరించారు. అనంతరం నాలుగు గంటలకు సమావేశాన్ని ముగించి అమరావతికి హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. కళ్యాణ మండపం వద్ద మహిళలు, యువకులు, కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. సమావేశం నుంచి రెండుసార్లు బయటకు వచ్చి కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేశారు. ఆయనతోపాటు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), చెనమల్ల చంద్రశేఖర్, వేగేశ్న కనకరాజు సూరి, బొలిశెట్టి శ్రీనివాస్, విడివాడ రామచంద్రరావు, జుత్తిగ నాగరాజు, బొమ్మిడి నాయకర్, మల్లినీడి తిరుమలరావు(బాబి)తోపాటు తదితరులు పాల్గొన్నారు.



పవన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు వలవల బాబ్జి, మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, పితాని సత్యనారాయణ, తోట సీతారామలక్ష్మి, అంగర రామ్మోహన్, ఆరిమిల్లి రాధాకృష్ణ, వేటుకూరి శివ, పొత్తూరి రామరాజు తదితరులు

గోకరాజు రామంకు పలకరింపు

టీటీడీ బోర్డు బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజును పవన్ పలకరించారు. రామరాజు సతీమణి ఇటీవల కొంత అస్వస్థతకు గురయ్యారని తెలుసుకుని వారితో కొద్దిసేపు మాట్లాడారు. అక్కడి నుంచి నేరుగా హెలీప్యాడ్‌కు చేరుకుని మంగళగిరి వెళ్లిపోయారు.

వైసీపీ జెండాతో హల్‌చల్

మాజీ ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ఇంటి వద్దకు టీడీపీ, జనసేన క్యాడర్ పెద్ద సంఖ్యలో చేరుకున్న సమయంలో ఒక వైసీపీ అభిమాని ఆ పార్టీ జెండాతో హల్‌చల్ చేశాడు. దీంతో కొందరు టీడీపీ కార్యకర్తలు అతని వద్దకు వెళ్లి హెచ్చరించటంతో జారుకున్నాడు.

పటిష్ఠ పోలీస్ బందోబస్తు

పవన్ పర్యటన సందర్భంగా 180 మందికిపైగా పోలీసులు రెండో పట్టణ సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు పోలీసులతో వాదనలకు దిగారు. కల్యాణ మండపం వద్ద మాత్రం పోలీసు, ప్రైవేట్ సెక్యూరిటీ ఎంపిక చేసిన జనసేన నాయకులను మినహా, మీడియా ప్రతినిధులను ప్రధాన ద్వారం వద్ద నిలిపివేశారు. హాలు వద్దకైనా తమను పంపాలని కొంత మంది మీడియా ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. వారు మాత్రం ససేమిరా అన్నారు. ఫొటోలు, వీడియోలు తామే పంపిస్తామంటూ తేల్చి చెప్పారు. మీడియా బయటే పడిగాపులు పడాల్సి వచ్చింది.

బీజేపీ నేత పాకా నివాసంలో

బీజేపీ సీనియర్ నేత పాకా వెంకట సత్యనారాయణ నివాసానికి పవన్ వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనలోని లోపాలను సరిదిద్దుతూ వచ్చే ప్రభుత్వంలో పాలనాపరమైన అంశాలు ఎలా ఉండాలనే అంశంపై చర్చించారు. జిల్లాలో బీజేపీ పరిస్థితులు, తాజా రాజకీయ అంశాలపై దాదాపు అరగంటపాటు చర్చించారు. వారితో పేరిచర్ల సుబాష్‌రాజు, కోమటి రవితోపాటు చిలుకూరి నరసింహరాజు, కాయిత సురేంద్ర తదితరులు ఉన్నారు.

• పోటీ చేస్తే గెలిపిస్తాం : అంజిబాబు



సమావేశం అనంతరం పవన్ బయటకు వచ్చి భారీగా తరలి వచ్చిన టీడీపీ శ్రేణులకు అభివాదం చేసి కారులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) నివాసానికి వెళ్లారు. అంజిబాబు, ఆయన కుమారుడు ప్రశాంత్‌తో తాజా రాజకీయాలపై చర్చించారు. మీరు భీమవరం నుంచి పోటీ చేస్తే గెలిపించే బాధ్యత తాము తీసుకుంటామని అంజిబాబు స్పష్టం చేశారు. వేరేచోట పోటీ చేస్తే ఇక్కడ తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. పొత్తులపై ఢిల్లీలో సమావేశమయ్యాక జిల్లాలోని అన్ని సీట్లపై స్పష్టత వస్తుందని పవన్ తేల్చి చెప్పారు. అలాగే ఆక్వా సమస్యలు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో జనం పడుతున్న ఇబ్బందులను జనసేనాని దృష్టికి తీసుకువెళ్లారు. చర్చల్లో టీడీపీ కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చింతలపూడి సారథి రోషన్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఐదేళ్ల విరామం తర్వాత టీడీపీకి ఇన్‌చార్జి

» స్థానికంగా అన్నీ ఆచి తూచి తుది నిర్ణయం

» మిగతా ఆశావహులకు పార్టీలో సముచిత స్థానం

» పార్టీ కేడర్, నేతల హర్షామోదం

చింతలపూడి తెలుగుదేశంలో నెలకొన్న సుదీర్ఘ సస్పెన్స్‌కు తెరపడింది. నియోజకవర్గ పార్టీ సారథ్య బాధ్యతలను సొంగా రోషన్‌కుమార్‌కు బుధవారం అప్పగించారు. 2019 సాధారణ ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ ఓటమి చెందడంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరినీ నియమించకుండా తాత్సారం చేశారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడం, ఆశావహుల సంఖ్య భారీగా ఉండడంతోపాటు మరింత మంది టిక్కెట్ రేసులో నిలిచారు. ఒకప్పుడు ఇక్కడ కోటగిరి విద్యాధరరావు ఏకపక్షంగా నాయకత్వం నడిపారు. ఆ తర్వాత ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మారడంతో రాజకీయాలు మొత్తం మారిపోయాయి. ఎవరికి వారు ఎదిగేందుకు ప్రయత్నాలు జరిగాయి. తెలుగుదేశం పక్షాన డాక్టర్ కర్రా రాజారావు, పీతల సుజాత వంటి వారు పోటీపడ్డారు. సుజాత గెలుపొంది మంత్రిగా ఎదిగారు. 2019 ఎన్నికల్లో మాత్రం తడబాటుకు గురవడంతోపాటు ఓటమి కొనితెచ్చుకున్నారు. పార్టీలో అంతర్గతంగా ఉమ్మడి జవాబుదారీతనం కొరవడడం, ఎవరిది పైచేయి అనే విషయంలో పోటీయే సాగింది. గడచిన రెండేళ్లుగా పార్టీ పూర్తి స్థాయిలో పుంజుకుంది. ప్రత్యేకించి జంగారెడ్డిగూడెంకు చెందిన ఆకుమర్తి రామారావు, స్థానికంగా గడచిన దశాబ్ద కాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న రోషన్ కుమార్‌తోపాటు అనిల్ బొమ్మాజీ తెర ముందుకు వచ్చారు. వీరు ముగ్గురు ఎవరికి వారు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా వ్యవహరించారు. ఒక దశలో వీరి ముగ్గురిలో ఎవరికి టికెట్ లభించినా ఉమ్మడిగా పనిచేస్తామనే నిర్ణయానికి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ముత్తవరపు జగ్గారెడ్డి, శ్యామ్ చంద్రశేషు, మండవ లక్ష్మణరావు, గరిమెళ్ళ చలపతి, మోరంపూడి మల్లికార్జునరావు, గుత్తా ప్రసాద్‌తోపాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ల నాగేశ్వరరావు, రావూరి కృష్ణ పక్కాల వెంకటేశ్వరరావు, మాటూరి వెంకట్రామయ్య వంటి నేతలంతా పార్టీ పటిష్టపడేలా జాగ్రత్తపడ్డారు. మధ్యలో అనిల్ బొమ్మాజీ వంటి నేతలకే టిక్కెట్ దక్కినట్టు ప్రచారం సాగినా అధిష్ఠానం దీనిపై ఎటువంటి సంకేతాలు ఇవ్వకుండా మిన్నకుండింది. ఈలోపే పార్టీ టిక్కెట్ రేసులో వున్నారంటూ పలువురి పేర్లు తెర ముందుకు రావడంతో మరింత గందరగోళం ఏర్పడింది. ప్రత్యేకించి ఈ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థి మాదిగ సామాజిక వర్గానికి చెందివారే ఉంటారని చాన్నాళ్ల క్రితం పార్టీ అధినేత చంద్రబాబు చూచాయగా వెల్లడించారు. అప్పటి నుంచి మాదిగ లేదా మాల సామాజిక వర్గాల నుంచి ఎవరిని ఎంపిక చేస్తారనే విషయంలో చర్చ సాగింది. ఈసారి గత అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని మాల సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ మధ్యనే పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి కొందరు కార్యకర్తలు గట్టిగా డిమాండ్ చేశారు. ప్రత్యేకించి హఠాత్తుగా కొందరి ప్రేరణతో కార్యకర్తలు ఈ తరహా డిమాండ్ చేయడాన్ని పరిగణనలోకి తీసుకుంటారనుకున్నా, దీనికి భిన్నంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన రోషన్‌కుమార్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు.

విధేయతకే పెద్దపీట

ఇప్పటికే వైసీపీ అభ్యర్థిని ప్రకటించడం, టీడీపీ ఎప్పుడు బరిలోకి దిగుతుందా.. అని టెన్షన్ పడిన కార్యకర్తలూ నేతలకు తాజా నిర్ణయంతో కొండంత ధైర్యం వచ్చింది. ఎట్టకేలకు పార్టీ విధేయతకే పెద్దపీట వేసినట్లయ్యింది. ప్రత్యేకించి బుధవారం ఉదయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, లింగపాలెం వంటి మండలాల నేతలతోపాటు పార్టీ ఆశావహులు రోషన్‌కుమార్, అనిల్ బొమ్మాజీ, ఆకుమర్తి రామారావుతోపాటు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.



లింగపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి రోషన్ నివాళి

ఇన్‌చార్జి నియామకంలో అభిప్రాయసేకరణ అనంతరం పార్టీ ఇన్‌చార్జిగా రోషన్‌ను అధికారికంగా ప్రకటించారు. 'చింతలపూడి స్థానం నుంచి టిక్కెట్, పార్టీ పగ్గాలు ఆశించిన బొమ్మాజీ, రోషన్, రామారావులు చాలాకాలంగా శ్రమకోర్చి పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. వీరు ముగ్గురిలో ఒకరికే అవకాశం దక్కుతున్నందున మిగతా ఇద్దరికీ పార్టీలో విశాల దృక్పథంతో సముచిత స్థానం ఇస్తాం. పార్టీ అధినేత చంద్రబాబుతో నేరుగా మిగతా ఆశావహుల్ని త్వరలో సమావేశపరుస్తాం. పార్టీ విజయానికి ఉమ్మడి కృషి కొనసాగాలి' అంటూ అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.

ఆలయాల్లో రోషన్ పూజలు

చింతలపూడి/జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 21 : చింతలపూడి ఇన్‌చార్జిగా ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన సొంగా రోషన్‌కుమార్‌ను నియమించడంతో ఆయన పార్టీలో సమన్వయంతో అందరిని కలుపుకుని వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం తొలుత ధర్మాజీగూడెం, లింగపాలెం, రంగాపురం, జంగారెడ్డిగూడెం, గుర్వాయిగూడెం ప్రాంతాల్లోని పలు ఆలయాలను దర్శించి పూజలు చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, సీనియర్ నాయకుడు రాజాన సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. లింగపాలెం, కామవరపుకోట మండలాల్లోనూ పర్యటించారు.

సీటు.. మాదే

» నరసాపురం టిక్కెట్‌పై బెట్టింగుల జోరు



నరసాపురం, ఫిబ్రవరి 21 : ఎన్నడూ లేని విధంగా ఈసారి ప్రధాన రాజకీయ పార్టీల మధ్య టిక్కెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉంది. ఇటు అభ్యర్థుల ఎంపిక, ప్రకటన కూడా ఆయా పార్టీలకు తలనొప్పిగా మారింది. కేడర్ మాత్రం ఇవేమి పట్టించుకోవడం లేదు. తమ నాయకుడికే టిక్కెట్ అని బల్లగుద్ది చెబుతూ మరీ పందేలకు కాళ్లు దువ్వుతున్నారు. దీనికి అవతల వర్గమూ మెట్టు దిగడం లేదు. దీంతో సీటుపై పందేలు జోరందుకున్నాయి. పది రోజులుగా నరసాపురంలో జరుగుతున్న ఈ పందేలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. వైసీపీ కూడా తమ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించలేదు. అయినప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజే మళ్లీ పోటీ చేస్తారని చెబుతున్నారు. ఇప్పటికే టీడీపీ-జనసేన పార్టీలో పొత్తులో వున్నాయి. ఈ కూటమిలోకి బీజేపీ కూడా చేరితే ఇక్కడ ఎవరు బరిలో ఉంటారన్నది తీరంలో పెద్ద చర్చ నడుస్తోంది. ఇటు టీడీపీ నుంచి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. జనసేన నుంచి బొమ్మిడి నాయకర్ బరిలో వున్నారు. మరోవైపు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఈ సారి పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెడతానని ప్రకటించారు. ఈ నెలాఖరున జనసేనలో చేరనున్నట్టు ఆయన వర్గీయులు ప్రకటించారు. పొత్తు ఖరారై వీరిలో ఎవరు అభ్యర్థులుగా నిలుస్తారు ? అన్న ఉత్కంఠ అన్ని పార్టీల్లోను నెలకొంది. తమకే టిక్కెట్ వస్తుందని ఆయా పార్టీల నేతలు చెబుతుండగా, వారి అభిమానులు సైతం తమ పార్టీ నేతకే టిక్కెట్ వస్తుందని ఘంటాపథంగా చెబుతున్నారు. కావాలంటే పందెం కాయాలంటూ అవతలి పక్షం వారికి సవాల్ విసురుతున్నారు. లక్షల రూపాయల పందేలు కేవలం టీడీపీ-జనసేనలోని ముగ్గురు నేతలపైనే కాస్తున్నారు. రేస్‌లో ఉన్న నాయకులు మాత్రం పార్టీ టిక్కెట్ తమకే ఇస్తుందన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఈ వారంలో దీనిపై పూర్తి క్లారిటీ రానుంది.



ఎన్నికల శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ఎన్నికల నోటిఫికేషన్ రాగానే నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలి

భీమవరం, ఫిబ్రవరి 21 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమలు ఎంతో కీలకమైందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. 'నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ఎం.సి.సి అమల్లోకి వచ్చి, కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు ఇది వర్తిస్తుంది. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే కార్యాలయాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలను, సంక్షేమ పథకాల ఫ్లెక్సీలను తొలగించాలి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వాటిని తీయించాలి. రాజకీయ నాయకుల విగ్రహాలను వస్త్రంతో మూసి ఉంచాలి. రాజకీయ పార్టీల ప్రచార కరపత్రాలపై ప్రింటింగ్ ప్రెస్ చిరునామా ఉందో లేదో పరిశీలించాలి. తాగునీటి ట్యాంకర్లపై ఫొటోలు, పేర్లు ఉంటే వాటిని కప్పి ఉంచాలి. హెలిప్యాడ్స్, ఫంక్షన్ హాల్స్ వినియోగానికి అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఇవ్వాలి. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు సమాచారం అందితే, వెంటనే తనిఖీ చేసి, వస్తువులను సీజ్ చేయాలి. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలి' అని కలెక్టరు సూచించారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటరు డాక్టర్ ఎస్.కీర్తికిరణ్, పురపాలక సంఘం కమీషనర్లు, ఎంపీడీవోలు, అసిస్టెంటు మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి అద్దె బస్సులు కావాలి

భీమవరంటౌన్, ఫిబ్రవరి 21 : ఆర్టీసీకి సంబంధించి జిల్లాలో అద్దె ప్రాతిపదికన పది బస్సుల కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్యచౌదరి తెలిపారు. ఆసక్తి కలిగిన ఆపరేటర్లు ఈ నెల 21 నుంచి వచ్చేనెల ఆరో తేదీ వరకు టెండర్లు దాఖలు చేయవచ్చునని తెలిపారు. వివరాలకు ఆర్టీసీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

సమస్యలపై నిర్లక్ష్యం

ఒక్కో ఊరిలో ఒక్కొక్కటి.. ప్రజా ప్రతినిధులు, అధికారులకు పట్టించుకునే తీరికేది ?

• ఈ నిర్మాణాలను ఆపేశారు.. గుర్తుందా ?



ఆచంట మండలం కరుగోరుమిల్లిలో మూడేళ్ల క్రితం గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, అంగన్‌వాడీ కేంద్రాల కోసం చేపట్టిన భవన నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపేశారు. ట్యాంకు పోరంబోకు భూముల్లో చేపడుతున్నారని.. ఫిల్లర్స్ దశలో గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికి మూడేళ్లు అయ్యింది. ఇప్పటి వరకు అధికారులు దీనిని పట్టించుకోలేదు. కొత్తగా వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ గారు దీనిపై ఓసారి ఆరా తీయాలని స్థానికులు కోరుతున్నారు.

- ఆచంట



• ఐదేళ్లుగా దొడ్డనపూడిలో గ్రామ కార్యదర్శి లేరు

గ్రేడ్ 1 పంచాయతీగా ఉన్న కాళ్ల మండలం దొడ్డనపూడికి ఐదేళ్లుగా రెగ్యులర్ గ్రామ కార్యదర్శి లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీకి వచ్చే నిధులు, వాటి ఖర్చుల నిర్వహణ సరిగా లేక అభివృద్ధి కుంటుపడుతోంది. తాగునీటి క్లోరినేషన్, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మురుగు కాలువల నిర్వహణ వంటి సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదు. దీనిపై పాలకవర్గ సభ్యులు ఇన్‌చార్జ్ ఎంపీడీవో దృష్టికి తీసుకు వెళ్లగా.. ఆయన దురుసుగా మాట్లాడారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో భాస్కరరావు మాట్లాడుతూ ప్రస్తుత ఇన్‌చార్జ్ కార్యదర్శి అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిపారు. ఆయన స్థానంలో ఇక్కడకు వెళ్లేందుకు ఎవరూ సముఖత చూపడం లేదని తెలిపారు. - కాళ్ల



• రైల్వే అండర్ పాస్ కావాలి

డబుల్ లైన్ వేయడంతో ఆకివీడు మీదుగా రోజూ 70 రైళ్ల వరకు తిరుగుతున్నాయి. ఆకివీడు రైల్వేస్టేషన్‌కు సమీపంలో సిద్ధాపురం వైపు వెళ్లేచోట ఒక రైల్వే గేటు, దుంపగడప వైపు వెళ్లే ప్రాంతంలో మరో రైల్వే గేటు ఉన్నాయి. గుమ్ములూరు వైపు, దుంపగడప కాలేజీ రోడ్‌లోను తరచూ గేట్లు పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- ఆకివీడు

• తాగునీటి ట్యాంకులు ఎప్పుడు శుభ్రం చేశారో..?



• నిధులు లేక గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్వహణ, వాటి శుభ్రత నానాటికి తీసికట్టుగా వుంది. ఈ మంచినీటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించక ఎనిమిది నెలలుగా పరీక్షలు పడకేశాయి. గతంలో ప్రభుత్వం అందజేసిన కిట్లకు కాలం చెల్లింది. దీంతో గత ఏడాది జూలై నుంచి పరీక్షలు చేయడం లేదు. 10-15 రోజులకు ఒకసారి ఈ ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉండగా నాలుగైదు నెలలకు కూడా ఆ ప్రక్రియ జరగడం లేదు. ఆర్థిక సంఘంతోపాటు పంచాయతీ సాధారణ నిధుల్లో 15 శాతం తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చునని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా అసలు నిధులే లేని పరిస్థితి. ఓవర్ హెడ్ ట్యాంక్‌లను తరచుగా శుభ్రం చేయాల్సి ఉన్నా అదేం జరగడం లేదు. అతిసార, విషజ్వరాలు ప్రబలినప్పుడు నీటి పరీక్షల హడావుడి ఉంటుంది తప్ప ఆ తరువాత వాటిని మర్చిపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ట్యాంకుల వద్ద ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసి ఎప్పుడు శుభ్రం చేశారు.. మళ్ళీ ఎప్పుడు చేయాలనే వివరాలను అందరికి తెలియపరిచేలా ప్రదర్శించేవారు. ఇప్పుడు అవేమీ కనిపించడం లేదు.

- అత్తిలి

25న ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ ఇసుక కొరత, కొవిడ్ కారణంగా నిర్మాణరంగ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కష్టకాలంలో ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్రాలు పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు ఈనెల 25న ఏలూరు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నామని బుధవారం సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, హేలపూరి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవసలహాదారు ఎం.శంకర్‌రావు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మిరపలో అత్యాధునిక రకాలు అభివృద్ధి చేయాలి



వర్చువల్‌లో మాట్లాడుతున్న మంత్రి కాకాని

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 21: మిరపలో చీడపీడలు తట్టుకునే రకాలతోపాటు, ప్రాసెసింగ్‌కు అనువైన రకాలు అభివృద్ధి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్దన్ సూచించారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం ఇయర్ ఆఫ్ చిల్లీస్ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ సంచాలకులు డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ మిరప పంటలో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. జాతీయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీకే బెహరా మాట్లాడుతూ శాస్త్రవేత్తలు మిరపలో ప్రాసెసింగ్‌తోపాటు ఫ్లెక్స్ సాస్‌కు అనువైన రకాలు తయారుచేయాలని సూచించారు. అనంతరం ఇయర్ ఆఫ్ చిల్లీస్ లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యాన ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్, అఖిల భారత కూరగాయల పథకం అధిపతి డాక్టర్ రాజేష్‌కుమార్, ఉద్యాన పరిశోధనా సంచాలకులు ఎల్.నారంనాయుడు మాట్లాడారు.

'ఆపరేషన్ వాలంటైన్' చిత్ర బృందం సందడి



మాట్లాడుతున్న హీరో వరుణ్ తేజ్, చిత్ర బృందం

దెందులూరు, ఫిబ్రవరి 21 : గాలాయగూడెం అచ్చమ్మ పేరంటలమ్మ ఉత్సవాల్లో ఐదోరోజు బుధవారం మెగా ప్రిన్స్, సినీ హీరో కొణిదెల వరుణ్ తేజ్, 'ఆపరేషన్ వాలంటైన్' చిత్ర బృందం సందడి చేసింది. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, మెగా అభిమాన సంఘం నాయకులు పెద్దిశెట్టి నాని, ఏనుగు రామకృష్ణ, వెంకటరత్నం నాయుడు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి సన్నిధిలో ఆపరేషన్ వాలంటైన్ ప్రమోషన్ చేయడం చాలా ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులతో సూపర్ హిట్ అవుతుందన్నారు. మెగా అభిమానులను ఉద్దేశించి హీరో మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రేమ అప్యాయతలకు, స్నేహానికి పుట్టినిల్లు మన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాసులని వారి అదరణతోనే మా మెగా ఫ్యామిలీ ఇంతటి స్థాయిలో ఉందన్నారు. అధిక సంఖ్యలో అభిమానుల రాకతో రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ నిలిచి పోయింది. అనంతరం రాత్రి 11 గంటల నుంచి సుప్రీమ్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జబర్దస్త్ టీం రాజమౌళి, షేకింగ్ శేషు, రిషిత, కెవ్వు కార్తిక్, యాంకర్ యాపిల్, పాడుతా తీయగా ఫేం సింగర్ చరణ్, రాజీ ప్రదర్శనలు చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు కాంగ్రెస్ నాయకుల తరలింపు

» ప్రత్యేక హోదా ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



చింతలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు

చింతలపూడి, ఫిబ్రవరి 21 : చింతలపూడి మండలంలో పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈనెల 22న అమరావతిలో ప్రత్యేక హోదాపై ధర్నా చేపట్టబోతున్న పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలకు మద్ద తు తెలిపేందుకు వెళ్తున్నారన్న సమాచారంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి.సుందరరావు, నాయకులు ఎం.వెంకటేశ్వ రరావు, సంకు ప్రసాద్, ఎస్.సుందరరావు, కె.కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మురళీ, పోతురాజు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోతునూరులో నియోజకవర్గ ఇన్‌చార్జి హౌస్ అరెస్ట్

దెందులూరు :వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న జగన్ రెడ్డికి ప్రజలందరూ బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని దెందులూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డీవీఆర్‌కే చౌదరి అన్నారు. సీఎం క్యాంపు ఆఫీసు ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నిరసన కార్యక్ర మానికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు బుధవారం అయనను హౌస్ అరెస్ట్ చేశారు.

ఆచంటలో నెక్కంటి సతీశ్‌కు నోటీసు

ఆచంట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సచివాలయ ముట్టడి కార్యక్ర మానికి వెళ్లడానికి పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున కాంగ్రెస్ నాయకులు వెళ్లకూడదని ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆచంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నెక్కంటి సతీశ్‌కు బుధవారం నోటీసు అందజేశారు.

పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

» అటవీ క్షేత్రాధికారి దావీదు రాజు హెచ్చరిక



వేళ్లచింతలగూడెం వద్ద పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పోలవరం, ఫిబ్రవరి 21 : పులి సంచారం పట్ల కూలి పనులకు వెళ్లే కూలీలు, పొలాల్లో పనిచేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదు రాజు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేవరపల్లి మండలం బందపురం, దేవరపల్లి హైవే ప్రాంతాల్లో సంచరించిన పులి గోపాలపురం మండలం వేళ్ల చింతలగూడెం, పెద్దాపురం, గుడ్డిగూడెం, చిట్యాల పరిసర ప్రాంతాల్లోని పొగాకు, జామాయిల్ తోట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుందని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి సంచారం అంతుబట్టని విధంగా ఉంటుందని హైవే సమీపంలో వాహనాల శబ్దాలకు సమీప పొంతాల్లో తిరుగాడుతుందని పోలవరం, గోపాలపురం మండలాల పరిధిలో గతంలో పులి సంచరించిన ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలోని అవంతి ఫ్యాక్టరీ సమీపంలో పులి తిరిగినట్టు పాదముద్రలు చూసిన కూలీలు భయంతో ట్రాక్టర్ ఎక్కి వచ్చేశారని, సమీపంలో పులి గాండ్రింపులు కూడా వినిపించాయని ప్రసార మాధ్యమాల్లో ప్రచారాలు కొనసాగుతున్నాయి.



కైకలూరులో జర్నలిస్టుల ర్యాలీ, లింగపాలెం, జీలుగుమిల్లిలో తహసీల్దార్లకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు, చినమల్లంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

జర్నలిస్టులకు రక్షణ కరువు

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడికి నిరసనగా ఆందోళనలు

అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై వైసీపీ నాయకుల మూకుమ్మడి దాడి దారుణం.. అని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆందోళనలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాల వద్ద అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

కైకలూరులో జర్నలిస్టుల ర్యాలీ

కైకలూరు, ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని, పత్రికాస్వేచ్ఛను కాపాడాలంటూ జర్నలిస్టులు నినాదాలు చేశారు. బుధవారం కైకలూరులో నియోజకవర్గ ప్రెస్ క్లబ్, ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో విలేకర్లపై దాడులు ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఎస్. పోతురాజు, రూరల్ సీఐ కృష్ణకుమార్, టౌన్ పోలీసుస్టేషన్ ఏఎస్సై వెంకటేశ్వరరావుకు వినతిపత్రాలను అందజేశారు. ఏలూరు జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి పెద్ది సురేష్, కార్యవర్గసభ్యుడు నరహరిశెట్టి శ్యాంబాబు, విజయకుమార్, కురేళ్ళ కిషోర్, వాసే పౌలురాజు, ముదినేపల్లి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నాగరాజు,వై.శ్రీనివాసు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కె.సువర్ణరాజు, ఎ.సత్యనారాయణ, సంపత్, నిక్కు శంకర్, ఎన్‌వీఎస్ పేర్రాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం : కొల్లు పెద్దిరాజు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, జగన్ పాలనలో ఇటు ప్రజలకు, పాత్రికేయులకు కూడా రక్షణ లేకుండా పోయిందని టీడీపీ పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు మండిపడ్డారు. బ్రిటిష్ కాలంలో కూడా మీడియాకు ఇలాంటి పరిస్థితులు లేవని, విలేకర్లపై కొందరు వైసీపీ అల్లరిమూకలు చేస్తున్న దాడులు, దూషణలు చూస్తుంటే జగన్ పతనానికి పరాకాష్టగా నిలుస్తుందన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి : ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 21: ప్రతికా స్వేచ్ఛను కాపాడి..జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నాయకులు లంక కృష్ణ మూర్తి, దండు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి, ఈనాడు కార్యాలయంపైన దాడులను తీవ్రంగా ఖండించారు.

ఉంగుటూరులో నిరసన

ఉంగుటూరు, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలో పాత్రికేయలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం ఉంగుటూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పోతురాజుకు వినతి పత్రం అందించారు. అధ్యక్షుడు ముప్పన భుజంగరావు, ఉపాధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరావు, ఆర్మా బులి వీరాస్వామి, పి.రవిశంకర్ పాల్గొన్నారు.

దాడి అమానుషం : లింగపాలెం ప్రెస్‌క్లబ్ సభ్యులు

లింగపాలెం, ఫిబ్రవరి 21 : రాప్తాడు ముఖ్యమంత్రి సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడాన్ని లింగపాలెం మండల ప్రెస్‌క్లబ్ తీవ్రంగా ఖండించింది. జర్నలిస్ట్‌లపై దాడిచేయడం అమానుషమని లింగపాలెం ప్రెస్‌క్లబ్ సభ్యులు అన్నారు. ఈ మేరకు లింగపాలెం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విలేకరులు రాపాక మోహన్‌రావు, ఎస్.డి.వి ప్రసాద్, కట్టా శ్రీనివాసరావు, చలమాల శ్రీనివాసరావు, కుమార్ మంగళం, లక్కపాం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మీడియాపై దాడి అమానుషం : పితాని

పెనుగొండ, ఫిబ్రవరి 21: జగన్మోహనరెడ్డి ప్రభుత్వ అక్రమాలపై నిజాలను నిగ్గు తేలుస్తున్న మీడియా సంస్థలు, ప్రతినిధులుపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని చినమల్లంలో ప్రజల వద్దకు పితాని ఎన్నికల ప్రచార పాదయాత్రను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికల స్వేచ్ఛలను కాలరాస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. అడుగడుగునా ఆయనకు పూలవర్షం కురిపించారు. వెలిచేటి బాబూరాజేంద్రప్రసాద్, గుత్తుల లోకేశ్‌కు మార్, కొండవీటి శ్రీనివాసరావు, ఆకుల శివ, జి.ప్రసాద్, వెంగళదాసు దానయ్య, బొక్కా ఏడుకొండలు, నెక్కంటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నక్కా శ్యామలా సోని పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు తగవు..

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 21 : ఫొటో గ్రాఫర్‌లు, జర్నలిస్ట్‌లపై దాడులు తగవని జీలుగుమిల్లి మండల ప్రెస్‌క్లబ్ తరఫున తహసీల్దారు ఆర్‌వీ వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. విలేకరులకు రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేయాలన్నారు. ప్రెస్ క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మారెడ్డి ప్రసాదరెడ్డి, జెట్టి రామకృష్ణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యులు కోలా రాము, సభ్యులు బొలగాని సత్తిబాబు, క్రొవ్విడి ప్రసాద్, నక్కా శ్రీను, ఉడా ప్రసాద్, కొప్పుల సాయి ఉన్నారు.

విలేకరులపై దాడులు హేయమైన చర్య : సీపీఐ

కుక్కునూరు:నిజాలను నిక్కచ్చిగా రాస్తున్న విలేకరులపై దాడులు చేయడం హేయమైన చర్య అని సీపీఐ కుక్కునూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం కుక్కునూరులో జరిగిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో మండల కార్యదర్శి షైసాక్షి వెంకటాచారి మాట్లాడారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై, కర్నూల్‌లో ఈనాడు కార్యాలయంపై, మద్దికేరలో ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నా మన్నారు. సీపీఐ జిల్లా నాయకులు కె.లక్ష్మయ్య, వరకా శ్యామల, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవాలు



గజ, పొన్న వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో భక్తులు బారులు తీరారు. తొలుత పొలమూరి వారి వార్షిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పొలమూరి కుటుంబసభ్యులు, భక్తులు పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగిన నాగేశ్వరరావు వారిచే నిర్మితమైన గజ వాహనంపై స్వామిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి వెంట నారసింహ, గోవింద నామస్మరణ చేశారు. శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకటసత్యనారాయణ, శ్రీహరిరావు వారిచే పొన్నవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం రాత్రి ఎనిమిది గంటలకు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి హారతులు పట్టారు.

స్వామికి అన్నపర్వత మహానివేదన

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామికి అన్నపర్వత మహా నివేదన జరిపారు. పశ్చిమగోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. సాయంత్రం స్వామివారి మూల విరాట్ ఎదుట ఉన్న గంట మండపంలో అన్నాన్ని రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామికి మహానివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపం డితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామికి పూజలు నిర్వహించారు.

అంతర్వేదిలో నేడు..

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని హనుమద్ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు పండిత సదస్యం, ఏడు గంటలకు సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

నరసన్న సేవలో హోంమంత్రి వనిత



స్వామిని దర్శిస్తున్న హోంమంత్రి వనిత

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి21: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐ.ఎస్. జగన్నాథపురంలోని లక్ష్మీనారసింహుని ఆలయాన్ని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత సందర్శించారు. ఆమెకు అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారి మూలవిరాట్‌ను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందగా అధికారులు ద్వారకాతిరుమల స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఎంపీపీ బొండాడ మోహినీవెంకన్నబాబు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

విద్యుత్ షాక్‌తో ఐటీఐ విద్యార్థి మృతి

యలమంచిలి, ఫిబ్రవరి 21 : మండలంలోని కాజ పడమర గ్రామం నెక్కంటివారి చెర్వుగట్టు ప్రాంతానికి చెందిన కానేటి నీరాజ్‌బాబు(18) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. గ్రామానికి చెందిన నీరాజ్‌బాబు ఉల్లంపర్రు ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో తాళ్ల శ్రీనివాసరావు అనే ఎలక్ట్రీషియన్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం యథావిధిగా చించినాడ పనికి వెళ్తున్నానని ఇంటివద్ద చెప్పి వెళ్లాడు. చించినాడలో కొత్తగా నిర్మిస్తున్న ఓ భవనంలో కరెంట్ పనిచేస్తుండగా షాక్ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వా సుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గీత కార్మికుడి బలి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని ఈదర గ్రామంలో పామర్తి సుబ్బారావు(70) ప్రమాదవశాత్తు విద్యుత్ తీగె తగిలి చెట్టుపైనే ప్రాణాలు వదిలాడు. ఇంటివద్ద గల కొబ్బరిచెట్టు కాయలు దింపేందుకు చెట్టెక్కగా ప్రమాదవశాత్తు చెట్టుకు ఆనుకుని వెళుతున్న కరెంటు లైన్ తీగ తగిలి అక్కడే ప్రాణాలు వదిలాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలునుంచి జారిపడి వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక గుర్తు తెలియని వృద్ధుడు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాలివి.. ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని పెద్దఔట్‌పల్లి రైల్వే గేటు సమీపంలో సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు గల వృద్ధుడి మృతదేహం ఉన్నట్టు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు లేత ఆకుపచ్చరంగు లుంగీ, తెలుపు రంగు పొట్టి చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. ముక్కుపొడి రంగుతో కూడిన టవల్ ఉంది. మృతుడి చేతికి నలుపురంగు కాశీతాడు, ఎరుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్ఐ 95026 97672కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధం



రేకుల షెడ్డు వద్ద మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

ఆకివీడు, ఫిబ్రవరి 21: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధమైన ఘటన ఆకివీడులో జరిగింది. స్థానిక వారపుసంతలోని పోతుల సందులో పోతురాజు-చిన్నరమణమ్మ నివాసముంటున్నారు. తూర్పు గోదావరిలో జరుగుతున్న గాజులమ్మ జాతరకు ఈనెల 19న ఇంటి వద్ద రమణమ్మ తల్లిని ఉంచి వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున మంటలు వస్తుండడంతో భయాందోళనతో ఆమె బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికుడు గుర్రాని శ్రీను అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపుచేసే సమయానికే పూర్తి దగ్ధమైంది. రూ.1.80 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపకశాఖాధికారి వై.నాగేశ్వరరావు తెలిపారు. రేకుల షెడ్డుకు సమీపంలో వున్న మరో ఇంటిలో దీపావళి మందుగుండు సామగ్రి కూడా నిప్పు అంటుకోవడంతో వాటిని అగ్నిమాపక సిబ్బంది అదుపుచేశారు.



చెరువు గట్ల వద్ద పరిశీలిస్తున్న రైతులు, చనిపోయి తేలిన చేపలు

చేపల చెరువులో విషప్రయోగం

» నీటిపై తేలిన చేపలు.. పాటదారుడి గగ్గోలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి21: పంచాయితీ చెరువులో జరుగుతున్న చేపల పెంపకంపై విషప్రయోగం జరగడంతో పాటదారుడు లబోదిబోమంటున్నాడు. మండలంలోని గుండుగొలనుకుంటకు చెందిన వెంకన్నబాబు పంచాయతీకి చెందిన చెరువును చేపల పెంపకం నిమిత్తం రూ.4.50లక్షలకు గతేడాది సెప్టెంబరులో లీజుకు తీసుకున్నాడు. అనంతరం సుమారు రూ.పది లక్షల పెట్టుబడితో బంగారు తీగ చేపపిల్లలను పెంచుతున్నాడు. మరో మూడునెలల్లో చేపలు పెరిగి చేతికి వచ్చేసమయంలో బుధవారం ఉదయం చెరువు దగ్గరకు వెళ్లి చూసే సరికి అవన్నీ చనిపోయి నీటిపై తేలుతూ కన్పించాయి. ఈ విషయాన్ని స్థానిక రైతులకు తెలుపగా వారు వచ్చి పరిశీలించి చెరువులోను, గట్లపైన పురుగుమందుల అవశేషాలను గుర్తించారు. విషప్రయోగం జరిగి ఉండవచ్చనే అనుమానంతో ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో మూడు గొర్రెల మృత్యువాత



చనిపోయిన గొర్రెల వద్ద రైతు భాస్కరరావు

పెదవేగి, ఫిబ్రవరి 21 : విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పెదకడిమికి చెందిన బాధిత గొర్రెల యజమాని నెర్సు భాస్కరరావు తెలిపిన వివరాలివి.. కొప్పాకనుంచి చినబోయినపల్లి వెళ్లే రోడ్డులో గో-సంరక్షణ సమితి సమీపంలో గొర్రెలు మేస్తుండగా రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎర్త్ వైరును గొర్రెలు తాకడంతో మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడం తోపాటు ఎర్త్‌వైరుకు విద్యుత్ ప్రవహించడంతో ఈ ప్రమాదం జరిగిందని సుమారు రూ.60 వేల విలువైన మూడు గొర్రెలు చనిపోయాని గొర్రెల యజమాని భాస్కరరావు తెలిపారు. మృత్యువాత పడిన గొర్రెలకు పరిహారం అందించే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు..



ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ

పెదవేగి, ఫిబ్రవంరి 21 : కొప్పాకలో చోరీ జరిగిన ఘటనపై పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పామర్తి రాము భార్య, పిల్లలతో కలిసి మంగళవారం సాయంత్రం అత్త గ్రామమైన ముసునూరు మండలం గోపవరం వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేస రికి ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి, బీరువాతో పాటు ఇంట్లో వస్తువులను చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదుతో కలిపి మొత్తం రూ.5 లక్షల విలువైన వస్తువులు చోరీ జరిగిందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కౌలు రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

» కొప్పాకలో నాబార్డు బృందం పర్యటన.. రైతులతో ముఖాముఖి



సమస్యలు తెలుసుకుంటున్న నాబార్డు అధికారులు

పెదవేగి, ఫిబ్రవరి 21 :కౌలు రైతులకు అందిస్తున్న రుణాలు, కౌలుకార్డుల పంపిణీ జరిగిన విధానం, సమస్యలను తెలుసుకోవడం ద్వారా పరిష్కారానికి అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ వై.రామకృష్ణ అన్నారు. ముంబై నుంచి నాబార్డు అధికారుల బృందం కొప్పాక లోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును బుధవారం సందర్శించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే దానిపై చర్చించారు. అనంతరం గ్రామీణ బ్యాంకులో కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసిన విధానాన్ని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డుల ద్వారా రుణాలు అందించే క్రమంలో కొంతమంది కౌలు రైతులకు రుణాలు సక్రమంగా అందడంలేదనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. నాబార్డు ప్రధాన కార్యాలయం అధికారులు బెంజిమెన్ థామస్, అరవిందకుమార్, ప్రణవ్ ఖత్రి, సమరక్ మెహంతి, అనిల్‌కాంత్, నీలాద్రి, పెదవేగి ఏవ ఎం.ప్రియాంక ఉన్నారు.

తెలుగు భాషలో రెండు తీర్పులు



భీమవరం క్రైం, ఫిబ్రవరి 21 :మాతృభాషా దినోత్సవం రోజున బుధవారం భీమవరం న్యాయస్థానంలోనూ, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పాలకొల్లు న్యాయస్థానంలోనూ సివిల్ కేసులలో మాతృభాష తెలుగులో తీర్పునిచ్చి మరోసారి తన మాతృభాష తెలుగు పట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయాధికారి ఏకా పవన్‌కుమార్ కృతజ్ఞత ప్రకటించారు. భీమవరంలోని పౌరులందరికీ ముఖ్యంగా సదరు వాజ్యములలోని కక్షిదారులకు తమ వాజ్యము ఎందుకు గెలిచా మో, లేక ఓడిపోయామో అనేది అర్థం అవ్వాలంటే తీర్పులను సంబంధిత ప్రాంతీయ భాషలలోనే ఉంటే బాగుంటుందని, ఈ విషయమై భారత ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తిగా వచ్చినప్పటి నుంచి సాధ్యమైనంత వరకు తీర్పులను తెలుగు భాషలోనే ఇస్తున్నామన్నారు. న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటివరకు 25 వాజ్యములలో తెలుగులో తీర్పులు అందించానన్నారు. మా తృభాష దినోత్సవం సందర్భంగా తన బాధ్యతగా తెలుగులోనే న్యాయపరిపాలన అందించాలనే కోరికతో భీమవరం న్యాయ స్థానంలోని వాజ్యములోనే కాక, పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పాలకొల్లు న్యాయస్థానంలోనూ రెండు పౌర వాజ్యములలో తెలుగులో తీర్పు ప్రకటించినట్లు తెలిపారు.

తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు

పోలవరం, ఫిబ్రవరి 21 : కొవ్వూరు డిపో నుంచి షణ్ముక రామేశ్వరం, బాలరామ అయోధ్య, కాశీ యాత్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ వైవీవీఎల్ఎన్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. షట్ షణ్ముక రామేశ్వరం యాత్రలో తిరుచందూరు సుబ్రహ్మణ్యస్వామి, పలణి సుబ్రహ్మణ్య స్వామి, రామేశ్వర జ్యోతిర్లింగం శ్రీకాళహస్తి, తిరుత్తణి, కంచి, స్వామిమలై, పుజుచోమలై, మధురై, త్రిపుర కుండం, కన్యాకుమారి, తిరువణ్ణామలై శ్రీపురం, కాణిపాకం ఏడు రోజుల యాత్ర ఉంటుందని, పది రోజుల బాలరామ అయోధ్య కాశీయాత్రలలో మూడు రోజులు కాశీలో ఉండే విధంగా భువనేశ్వర్, పూరీక్షేత్రం, కోణార్క్, ప్రయాగ, నైమిశారణ్యం, అయోధ్య, కాశీ, గయ, శిరోగయ, బుద్ధగయ, అరసవల్లి, శ్రీకూర్మం, అన్నవరం పుణ్య క్షేత్రాల సందర్శన ఉంటుందన్నారు. కాశీ, అయోధ్య ఏడు రోజుల సత్వర యాత్ర ఉంటుందని భక్తుల సౌకర్యార్థం తక్కువ చార్జీలతో బస్సుల యాత్రలు కొనసాగుతాయన్నారు. వివరాలకు డిపో మేనేజర్ 91009 54631, ఏడీసీ 73829 07952 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆచంటలో అక్రమ కట్టడాల కూల్చివేత



ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

ఆచంట, ఫిబ్రవరి 21: కోర్టు ఉత్తర్వుల మేరకు ఆచంటలో జీ+2 షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి రోడ్డుపై నిర్మించిన టాయ్‌లెట్స్ లిఫ్ట్ భాగానికి సంబంధించి పిల్లర్‌లను ఎక్స్‌వేటర్ సాయంతో తొలగించినట్టు పంచాయతీ కార్యదర్శి నాగబాబు బుధవారం తెలిపారు. ఆచంటలోని మదనగోపాలస్వామి ఆలయం పక్కన నిర్మిస్తున్న జీ+2 షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి అక్రమంగా పంచాయితీ రోడ్డుపై నిర్మించారంటూ గ్రామానికి చెందిన నంబూరి రామ్‌కుమార్ 2022లో కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణంపై గతంలోనే రామ్‌కుమార్ కోర్టుకు ఫిర్యాదు చేయడంతో హైకోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించామన్నారు. రానున్న రోజుల్లో రోడ్డుపై నిర్మించిన షాపునకు సంబంధించి అటువంటి వారికి కూడా నోటీసులు ఇచ్చి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, స్థానిక పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.87 లక్షల రేషన్ బియ్యం పట్టివేత

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 21 : తెలంగాణ నుంచి ఆంధ్రాకు వస్తున్న అక్రమ రేషన్ బియ్యం లోడు లారీని జీలుగుమిల్లి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించారు. మంగళవారం రాత్రి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా లారీలో తరలించే 215 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చెక్‌పోస్టు నిఘా అధికారులు పట్టుకున్నారు. ఈ విషయమై సివిల్ సప్లయిస్ డీటీ ఎన్.సురేంద్ర, వీఆర్వోలు బుల్లిఅబ్బులు, షరీఫ్‌ల ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం విలువ రూ.3.87లక్షలు, లారీ విలువ రూ.5 లక్షలు మొత్తం రూ.8.87 లక్షలు ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి బిక్కవోలు కోళ్ల ఫారంకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నందిగామ జిల్లా చంద్రలపాడుకు చెందిన డ్రైవర్ మాతంగి శ్రీను, లారీ యజమాని గోపిపై కేసు నమోదు చేశారు. సరుకు వాహనం స్వాధీనం చేసుకున్నారు.



బీజేపీ నాయకుడు పాకా సత్యనారాయణ, వైసీపీ నాయకుడు గోకరాజు రామంతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

జనసేన అధినేత పవన్‌కు ఘన స్వాగతం

భీమవరం, ఫిబ్రవరి 21 : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ఆపార్టీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. రెండోపట్టణంలోని శివారు ప్రాంతంలో ఒక ప్రైవేట్ స్థలంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు ఆయన ఉదయం 10-40 గంటలకు హెలీకాప్టర్ ద్వారా చేరుకున్నారు. ఆయనకు ఉమ్మడి జిల్లాపార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పార్టీ ప్రొటోకాల్ ఛైర్మన్ మల్లినీడి తిరుమలరావు(బాబి), జిల్లా కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్, పీఏసీ సభ్యుడ వేగేశ్న కనకరాజు సూరి, బండి మహేష్, తదితరులు స్వాగతం పలికారు. వీరమహిళలు హారతి పట్టి స్వాగతం పలికారు. ఆయన అక్కడినుంచి కారు పైకి వచ్చి అభివాదంచేస్తూ పట్టణంలోకి విచ్చేశారు. హెలీప్యాడ్ వద్ద జనసేన కార్యకర్తలు, యువకులు కొంత సేపు సందడి చేశారు. సీఎం, సీఎం, అంటు నినాదాలు చేశారు.

పవన్‌ను కలసిన ఆరిమిల్లి, బాబ్జి

అత్తిలి, ఫిబ్రవరి 21 : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ భీమవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పశ్చిమలో 15 సీట్లను పూర్తిగా టీడీపీ-జనసేన గెలుచుకోవాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారని, 2014 నాటి రికార్డును మరోసారి సాకారం చేయాలని అభిప్రా యపడినట్టు తెలిపారు. వైసీపీ దుర్మార్గ పాలన అంతమొందించేందుకు టీడీపీ- జనసేన కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ సూచించారని ఆరిమిల్లి వివరించారు.

తాడేపల్లిగూడెం అర్బన్: భీమవరం విచ్చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు.

'కొంత మందికే షాదీతోఫా'

ఆకివీడు, ఫిబ్రవరి 21: ముస్లింలు కోర్టుకు వెళ్లడంతో న్యాయస్థానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు షాదీతోఫా కూడా కొంతమందికే ఇవ్వడం జరిగిందని మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జాకీర్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారం చేపట్టినా కాలయాపన చేస్తూ వచ్చిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో దుల్హన్ పథకంతో పాటు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరిఫ్, అజ్మల్, బాజీ, అలం, అతీఫ్, షరీఫ్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 21: వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్‌ను కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారి పి.విజయదుర్గ తెలిపారు. ఈ అదాలత్‌లో సివిల్, ఫైనాన్స్, క్రిమినల్, చెక్ బౌన్స్, యాక్సిడెంట్, ఎక్సైజ్ వంటి కేసుల్ని రాజీ చేసుకోవచ్చునన్నారు. సివిల్ కేసులు రాజీ అయితే ఇది వరకు కట్టిన ఫీజు వాపసు వస్తుందన్నారు. కక్షిదారులు ఈ అదాలత్‌ను సద్వినియోగపర్చుకోవాలని న్యాయమూర్తి కోరారు.

దంత వైద్య పరీక్షలు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 21: తూర్పుతాళ్ళు గ్రామంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. భీమవరం విష్ణు దంత వైద్యశాల, భీమవరం ఆస్పత్రిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డైరెక్టర్ అడ్డాల శ్రీహరి ప్రారంభించారు. సర్పంచ్ కడలి పెద్దిలక్ష్మి, పులపర్తి నాగరాజు, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ప్రోగ్రాం అధికారి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జుత్తిగ గ్రామ దేవత మావుళ్ళమ్మ జాతర

పెనుమంట్ర, ఫిబ్రవరి 21 : జుత్తిగ గ్రామదేవత శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి వార్షిక జాతరలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. మేళతాళాలు మంగళ వాయిద్యాలు విచిత్ర వేషధారణలు గరగ నృత్యాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ముడుపులు మొక్కుబ డులు చెల్లించారు.

అసమానతలు లేని సమాజం రావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 21: అసమానతలు లేని సమాజం కమ్యూనిజంతోనే సాధ్యం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా బుధవారం రెడ్‌బుక్ డే కార్యక్రమం మెంటేవారితోట సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా రెడ్ బుక్స్ డే పిలుపు నిచ్చామని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, వారిని చైతన్య పూరిత అధ్యయనం ద్వారానే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం వైకుంఠరావు, ఇంజేటి శ్రీనివాస్, చైతన్య ప్రసాదు, బి వరలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపల్లి వెంటే తామంతా...



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి అభిమానులు

మొగల్తూరు, ఫిబ్రవరి 21: మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు తీసుకున్న నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉండి ఆయన వెంట పయనిస్తామని మండలంలోని కొత్తపల్లి అభిమానులు పేర్కొన్నారు. బుధవారం మొగల్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముత్యాలపల్లి మాజీ సర్పంచ్ కర్రి వీరాస్వామి, మండల కోఆప్షన్ సభ్యురాలు పట్టా రజనీ, బర్రి రామస్వామి, కొల్లాటి నాగరాజు, దొంగ స్వామి, పొడపాటి అజయ్ మాట్లాడుతూ కొత్తపల్లి సుబ్బారాయుడు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రస్తుతం జనసేన పార్టీలోకి వస్తున్నందున తాము కూడా కొత్తపల్లి నాయకత్వంలో పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరుతున్నట్టు ప్రకటించారు.

సీపీఐ రెడ్‌బుక్స్ డే

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 21: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశ రాష్ట్ర రాజకీయంలో కొత్త సమీకరణలకు తెర తీస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లబోయిన రంగారావు అన్నారు. రెడ్ బుక్స్‌డే కార్యక్రమాన్ని సీపీఐ ఆధ్వర్యంలో భీమవరం ఇండస్ట్రీయల్ ఏరియాలో నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎర్రపుస్తకాల కోసం వెతుకులాట ప్రారంభం అయిందన్నారు. రాష్ట్రనికి ద్రోహం చేసిన బీజేపీని ఓడించాలన్నారు.



టీబీఆర్ పాఠశాలను సందర్శించిన నితిన్‌సాతె, సీఎస్ రావు

టీబీఆర్‌లో మిలిటరీ డిఫెన్స్ అకాడమీ

పెంటపాడు, ఫిబ్రవరి 21: అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్లో ఈ ఏడాది నుంచి మిలిటరీ డిఫెన్స్ అకాడమీ (సైనిక శిక్షణ) ప్రవేశపెడుతున్న నేపథ్యంలో సర్వీసెస్ సెలక్షన్ బోర్డు నుంచి పుణెకు చెందిన ఎయిర్ కమెడోర్ నితిన్ సాతే, బెంగళూరుకు చెందిన కల్నల్ సీఎస్ రావు బుధవారం టీబీఆర్ విద్యా సంస్థను పరిశీలించారు. మిలిటరీలో చేరాలనుకునే విద్యార్థులు ఇక్కడ శిక్షణ తీసుకోవచ్చునని వారు తెలిపారు. సంస్థ ఛైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో నూతనంగా ఇంటర్మీడియట్, మిలిటరీ డిఫెన్స్ అకాడమి స్థాపిస్తున్నందున మిలటరీ కి వెళ్లాలనుకునే విద్యార్థులు ఇంటర్మీడియట్ ఇక్కడే పూర్తిచేసి నేరుగా సైనిక శిక్షణ తీసుకోవచ్చునన్నారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ పర్వీన్‌కుమారిశర్మ, హెచ్ఎం కళ్యాణి, ఎన్‌సీసీ అధికారి ధనరాజు పాల్గొన్నారు.



నరసాపురంలో తెలుగు భాష అభివృద్ధికి పాటు పడిన వారి చిత్రాల ప్రదర్శన

మాతృ భాషను విస్మరించొద్దు

ఘనంగా మాతృ భాషా దినోత్సవం.. పలువురికి సన్మానం

తణుకు, ఫిబ్రవరి 21: మాతృభాషను విస్మరించరాదని, మాతృభాషతో పాటు ఇతర భాషలను నేర్చుకోవాలని, తాడేపల్లిగూడెం డీఆర్‌జీ ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ సుంకర గోపాలయ్య అన్నారు. బుధవారం చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ నేటి తరం తెలుగు మాట్లాడటానికి సిగ్గు పడుతోందని, మాతృభాషలో మాట్లాడటాన్ని గర్వంగా భావించాలన్నారు. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, పద్యరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

భీమవరం ఎడ్యుకేషన్: తెలుగును ప్రాచీన భాషగా గుర్తించాలని తెలుగు పండితులు సాదే యాకోబు అన్నారు. డీఎన్నార్ కళాశాలలో బుధవారం ప్రపంచ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సోమరాజు మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో తెలుగుశాఖ అధిపతి టి చిట్టిబాబు, సోషల్ వర్క్ అధ్యాపకులు సీహెచ్ రంగారావు, తెలుగు అధ్యాపకులు యు. శ్రీరామరాజు, వి.నరసింహరావు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: వేములదీవి గొంది మూల యూపీ హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు బాష అభివృద్ధికి పాడుపడిన వారి చిత్రాలను చూపి ప్రదర్శన చేశారు. ఆనాడు తెలుగు బాష అభివృద్ధికి కృషి చేసిన మేధావులు, పోరాట యోధులు, రచయితలను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



రాజమండ్రిలో రంగసాయికి సన్మానం

గణపవరం: ప్రపంచంలో ఏ భాష ఉన్నప్పటికి మాతృభాష విద్యార్థుల మనోవికాసానికి, అభివృద్ధికి తోడ్పడుతుందని తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జి.వెంకటరమణ అన్నారు. గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులంతా తెలుగు భాషపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం తెలుగు సాహిత్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆకివీడు రూరల్: అమ్మభాషపై పట్టుసాధించినప్పుడే అన్నంపెట్టే పరభాషలను అలవోకగా నేర్చుకోవచ్చునని శతకకర్త కవి, తెలుగు భాషోపాధ్యాయుడు డాక్టర్ పెంకి విజయ్‌కుమార్ అన్నారు. దుంపగడప గ్రామంలోని జడ్పీపాఠశాలలో తెలుగుభాషపై పఠనం, లేఖనం, సామర్థ్యాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన చిన్నారులు వాసంతి, కీర్తన, వైశాలి, హరిప్రియ, రాజ్యలక్ష్మీలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు అనురాధ, మెహబూబున్నీసా, రమేష్, పద్మజ, సూర్యకుమారి పాల్గొన్నారు.

పెనుగొండ: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ పీవీ జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతి కవి, రచయిత, గాయకుడు డాక్టర్ బాల చందర్‌ను కళారత్న బిరుదుతో ఘనంగా సత్కరించారు.

భీమవరం టౌన్: రాజమండ్రిలో నిర్వహించిన మాతృభాషా దినోత్సవంలో భీమవరంకు చెందిన విశిష్ట సేవాతత్పరులు కొయ్యాన పద్మావతి, చెరుకువాడ రంగసాయికి పురస్కారాలు అందించారు. కొయ్యాన పద్మావతికి గోదావరి కీర్తి పురస్కారం, చెరుకువాడ రంగసాయికి జాతీయ ప్రతిభ పురస్కారాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా చేతులమీదుగా అందించారు.

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం







ఆకివీడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు.. అబ్బిరాజుపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామానాయుడు.. అత్తిలి మండలంలో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పాదయాత్ర

ఆకివీడు, ఫిబ్రవరి 28: చంద్రబాబుతోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం, ఇంటింటికి మన రాంబాబు, బాబు షూరిటీ భవిష్యత్తు భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక 12వ వార్డులో బుధవారం ఆయన పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ఓటమి ఖాయమని నిర్ధారణ కావడంతో శాంతంగా ఉంటున్న రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే దాడులు ముమ్మరం చేశారన్నారు. టీడీపీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, కౌన్సిలర్లు బొల్లా వీర శ్వేత, అజ్మల్, జాకీర్, రామరాజు, శ్రీను, బొర్రా సుజాత పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా ఉంటా

ఉండి, ఫిబ్రవరి 21:క్రైస్తవులకు అండగా వుండి వారి పురోభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే మంతెన రామరాజు పేర్కొన్నారు. బుధవారం ఉండిలో నియోజకవర్గస్థాయిలో సేవకుల ఆత్మీయసదస్సు సందడిగా సాగింది. సేవకులుగా పిలువబడే పాస్టర్లు ఆయా క్రైస్తవుల పెద్దలంతా అంతా విచ్చేసి ఎమ్మెల్యే రామరాజును అభినందించి ఆశీర్వదించారు. ఐఎఫ్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ సభలో తన దృష్టికి తీసుకుని వచ్చిన క్రైస్తవుల సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తమ పార్టీ దృష్టికి తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారు. మహాసేన రాజేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రామరాజుకు అండగా నిలువాలంటూ కోరారు.

అరాచక పాలన అంతం చేయాలి

అత్తిలి, ఫిబ్రవరి 21 : వైసీపీ అరాచకపాలన అంతమొందించేందుకు టీడీపీ, జనసేన కలసి పని చేయాలని తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం స్కిన్నెరపురంలో సకల జనుల్లో చైతన్యం తెచ్చేందుకు నిర్వహిస్తున్న రేపటి కోసం పాదయాత్ర రెండో రోజు కొనసాగింది. బీసీ సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని, బడుగు బలహీన వర్గాలను ఆదుకున్న ఘనత టీడీపీదేనన్నారు. అనంతరం పాదయాత్ర చలివేంద్ర చెరువు మీదుగా లక్ష్మీనారాయణపురం చేరింది. అక్కడ ఆరిమిల్లి బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం అదే గ్రామంలో పల్లె నిద్ర చేశారు. పార్టీ అత్తిలి మండల అధ్యక్షుడు అనాల ఆదినారాయణ, కార్యదర్శి సత్యనారాయణ, పోలిశెట్టి చంటి, నాగేశ్వరరావు, జనశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉనికిలిలో పాదయాత్ర

సకల జనుల చైతన్యయాత్ర రేపటి కోసం పాదయాత్రను ఆరిమిల్లి గురువారం అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో ప్రారంభిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు అనాల ఆదినారాయణ తెలిపారు. అనంతరం ఆరవల్లి, దంతుపల్లి, కంచుమర్రు, మంచిలి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తారన్నారు.

జగన్ పాలనకు చరమగీతం

యలమంచిలి, ఫిబ్రవరి 21: జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. అబ్బిరాజుపాలెంలో బుధవారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని, వచ్చే ఎన్నికల్లో గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పాదయాత్రలో అడుగడుగునా ఎమ్మెల్యే రామానాయుడుకి మహిళలు హారతుల ఇచ్చారు. రైతులు ఆయనకు ఎదురొచ్చి ఐదేళ్లలో పడ్డ కష్టాలను చెప్పుకొని వాపోయారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, టీడీపీ, జనసేన నాయకులు కడలి గోపాలరావు, వలవల బాబి, అరిమిల్లి చిన్ని, బొప్పన రాంబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వచ్చే నెల 20న విగ్రహ ప్రతిష్ఠ

ఆకివీడు, ఫిబ్రవరి 21: మార్చి 20న జరుగు వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రతిష్ఠకు విగ్రహాలు బుధవారం చేరుకున్నాయి. ఆలయ పునఃనిర్మాణం తుదిదశకు చేరుకుంది. మార్చి 15 నుంచి ఆలయానికి సంబంధించి అనేక కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. దాతలు కమిటీని సంప్రదించి విరాళాలు అందజేయాలన్నారు.

మేనేజ్‌మెంట్ కోర్సులతో ఉపయోగం

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 21 : ఇంజనీరింగ్‌తో పాటు మేనేజ్మెంట్ కోర్సులు కూడా చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మేనేజ్‌మెంట్ రంగ నిపుణులు, డీఎన్నార్ విద్యా సంస్థల పీజీ కోర్సెస్ మాజీ డైరెక్టర్ డా.జె చంద్రప్రసాద్ అన్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మ్యాథమెటిక్స్ అండ్ హ్యూమినిటీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ మేనేజ్‌మెంట్ డేని బుధవారం నిర్వహించారు. హ్యూమనిటీస్ హెడ్ డా.డి వెంకటపతిరాజు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా చంద్రప్రసాద్ మాట్లా డుతూ దైనందిన జీవతం నుంచి అత్యున్నత స్థాయి వరకు మేనేజ్మెంట్ ప్రక్రియ ఉంటేనే మనిషి దేనినైనా సాధించగలరని గుర్తు చేశారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎం పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

యువజన ఉపాధ్యక్షుడిగా కిషోర్ యాదవ్

కాళ్ళ, ఫిబ్రవరి 21 : ఎల్ఎన్‌పురం గ్రామానికి చెందిన తానింకి కిషోర్‌యాదవ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం కిషోర్ యాదవ్ విలేకరులతో మాట్లాడారు. దీనికి సంబంధించి రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు.

దోపిడి అంతానికి ఉద్యమాలే మార్గం



మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

తణుకు, ఫిబ్రవరి 21: దోపిడీ అంతానికి ఉద్యమాలు, పోరాటాలే మార్గమని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పి.దక్షిణామూర్తి అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయ ంలో 'రెడ్ బుక్స్ డే'ని పురస్క రించుకుని నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కారల్ మార్క్స్- ఏంగిల్స్ రచించి విడుదల చేసిన అతి చిన్న పుస్తకమైన కమ్యూనిస్టు ప్రణాళిక రాజులు, చక్రవర్తులు, భూస్వాములు పెట్టుబడిదారుల దోపిడీ స్వభావాన్ని బట్టబయలు చేసిందన్నారు. దారిదీపం సంపాదకుడు డీవీవీఎస్ వర్మ మాట్లా డుతూ నేడు మన దేశం, రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలకు రెడ్ బుక్స్‌లో పరిష్కారం దొరుకుతుందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, అజయకుమారి మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

పాలకోడేరు, ఫిబ్రవరి 21 : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో నూతన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గొరగనమూడి గ్రామంలో జగనన్న కాలనీకి సంబంధించిన ఇళ్ల పట్టాల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.

ఘనంగా గోస్తనీ నది తీర్థోత్సవాలు



పాలకోడేరు, ఫిబ్రవరి 21 : మోగల్లు గ్రామ శివారు గోస్తనీ నది వద్ద గోస్తనీ నది 93వ తీర్థోత్సవాలు ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామికి తామర వెండిపూలతో పూజా కార్యక్రమాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అరుణాచలం మాధవిచే ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. బుధవారం రాత్రి చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. ఈ మూడు రోజుల పాటు గోస్తని నది తీర్థోత్సవాలు ఆలయ నిర్వాహకులు గాదిరాజు కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పాలకోడేరు, ఫిబ్రవరి 21 : జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో గెలుపొందిన 40 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేసిన శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తోట కాశీ జగనాథం అభినందించారు. 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గులిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు.

రేపు పర్యావరణ పరీక్ష

వీరవాసరం, ఫిబ్రవరి 21: ఫిబ్రవరి మూడవ తేదీన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంనకు సంబంధించి జరగవలసిన పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్ష వాయిదా పడిన విషయం విధితమే. ఈ పరీక్షను ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నారని వీఈసీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.బలరాం తెలిపారు. విద్యార్థులు ఇది గుర్తించి 23వ తేదీ ఉదయం పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

రావి, వేప చెట్టుకు కల్యాణం



వీరవాసరం, ఫిబ్రవరి 21: వీరవాసరం తూర్పుచెరువుగట్టున ఉన్న ఆకాశపు వారి కోదండ రామాలయం ఆవరణలో బుధవారం లక్ష్మీ అశ్వత్థనారాయణ కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణుగా వృక్ష రూపంలో ఉన్న రావిచెట్టుకు, మహాలక్ష్మీగా కలిసిన వేపచెట్టుకు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు నాగమణి సంతోషికుమారి, ఆంజనేయులు సౌజన్య దంపతులచే కల్యాణాన్ని జరిపించారు. హోమం నిర్వహించారు. వివాహానంతరం అన్నసమారాధన నిర్వహించారు.

తేతలి పాఠశాలలో బేటీ బచావో-బేటీ పడావో

తణుకు, ఫిబ్రవరి 21: తేతలి జడ్పీ హైస్కూలులో బేటీ బచావో- బేటీ పడావో ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యాశాఖ వంద రోజుల ప్రణాళికలో ఒక్కోరోజు ఒక్కో ప్రముఖ మహిళను పరిచయం చేస్తూ చేపట్టిన కార్యక్రమం అని హెచ్ఎం కేవీ రంగయ్య తెలిపారు. ఉపాధ్యాయులు బీఎం గోపాలరెడ్డి, రామకృష్ణ, పుల్లారెడ్డి, సుధారాణి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ స్వామి కల్యాణం



పోడూరు, ఫిబ్రవరి 20: కవిటం గ్రామంలో అతిరుద్ర మహాయాగం మహోత్సవాలు 11వ రోజు బుధవారం అత్యంత ఘనంగా జరిగాయి. మహాయాగ మహోత్సవాల్లో భాగంగా పండితులు మంత్రోచ్ఛరణ, మేళతాళాలు భక్త జనసందోహం మధ్య కన్నుల పండువగా సింహాచలం శ్రీవరలక్ష్మీ సమేత నృసింహ స్వామి కల్యాణం నిర్వహించారు.

దేశాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కలశాలతో ఊరేగింపు (ఇన్‌సెట్‌లో) దేశాలమ్మ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని కుంచ నపల్లి గ్రామదేవత దేశాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించా రు. గ్రామంలో మహిళలు అభిషేక జలాల కలశాలతో ఊరేగింపుగా సాగారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం శిఖర ప్రతిష్ఠ హోమాలు నిర్వహిం చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

సాయిసత్య వ్రతాలు



గణపవరం, ఫిబ్రవరి 21 : గణపవరంలోని బొబ్బిలి వంతెన వద్ద ఉన్న సాయిబాబా ఆలయం 27వ వార్షికోత్సవాలు మూడురోజులుగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో సాయిసత్యవ్రతాలు వైభవంగా నిర్వహించారు. కొమ్మరకు చెందిన గోవిందరాజు వెంకటసత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మహిళాలచే వ్రతాలు జరిపించారు. గురువారం ముగింపుగా అఖండ అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ ఛైర్మన్ వేగేశ్న సుబ్బరాజు, ఆధ్యాత్మికవేత్త కఠారి రంగరాజులు తెలిపారు.

శ్రీవారి అన్నదాన భవనానికి విరాళం



కాళ్ళ, ఫిబ్రవరి 21: కాళ్ళకూరు వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన భవనానికి గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత డా.వెంకట రామరాజు రూ.1,01,116 విరాళం అందించినట్లు ఈవో మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రతిమతో సత్కరించారు.

టీడీపీ నాయకుడికి శివరామరాజు పరామర్శ



ఉండి, ఫిబ్రవరి 21:గుర్తు తెలియని వ్యక్తి చేతిలో గాయపడిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యశోధ కృష్ణయ్యను కలిగొట్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు పరామర్శించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, మోపిదేవి శ్రీను, పొత్తూరి ఫణివర్మ, గ్రామ సర్పంచ్ మాదిరెడ్డి సూర్యసత్యనారాయణ, ఎంపిటిసీ రుద్రరాజు యువరాజు పాల్గొన్నారు. మండలంలోని ఆరేడులో అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ యజమాని భూపతి రవికుమార్‌కు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు.

ధ్వజ స్తంభం ఏర్పాటుకు రూ.4 లక్షల 80 వేలు

ఆచంట, ఫిబ్రవరి 21: పెనుమంచిలిలో సోమేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటు నిమిత్తం సీజీఎఫ్ నిధులు రూ. 4 లక్షల 80 వేల రూపాయలు మంజూరైనట్టు ఈవో రాము తెలిపారు. ఈ-టెండర్ ద్వారా దీనికి సంబంధించిన పనులు ఖరారు చేయడం జరుగుతుందన్నారు.

రోటరీ క్లబ్ సాయం



పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 21: పాలకొల్లు రోటరీ క్లబ్‌ను రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు బుధవారం సందర్శించారు. ముందుగా ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్‌లో క్లబ్ సభ్యులు స్వాగతం పలికారు. మద్దాల వాసు ధన సాయంతో పేద విద్యార్థికి సైకిల్ అందచేశారు. ఎస్‌కేపీటీఆర్ స్కూల్‌లో ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు ఆర్థిక సాయంతో స్కూల్‌కి 20 కుర్చీలను అందచేశారు. ఎంఎంకె హైస్కూల్‌లో డెంటల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం సత్య కాలనీలో పేదవారికి రేపాక రత్నరాజు సాయంతో 50మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. బీవీఆర్ఎం స్కూల్‌లో విద్యార్థులకు చందక రాము సాయంతో 132మందికి పరీక్ష అట్టలను పంపిణీ చేశారు.

ఎండలోనే పురుగు మందులు వాడాలి



మొగల్తూరు, ఫిబ్రవరి 21: దాళ్వా చేలకు పురుగు మందులు వినియోగించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. బుధవారం మొగల్తూరు పంచాయతీ పరిధిలో పాలకమ్మ చెరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయ భూములు ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు, మూడు రోజులుగా మంచు కురుస్తున్నందున ఎండ కాసే సమయంలో మాత్రమే పురుగు మందులు వినియోగించాలన్నారు. ఎరువులు, పురుగుమందులు వినియోగం తగ్గించి అధిక దిగుబడి సాధనకు రైతు భరోసా కేంద్రాలు, లేదా తమ సిబ్బందిని సంప్రదించి తగు సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

బిల్డింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కారంలో విఫలం

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 21: బిల్డింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలం అయ్యిందని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సంయుక్త కార్యదర్శి బోలడా నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ అన్నారు. పాలకొల్లులో బుధవారం బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వీరు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బిల్డింగ్ వర్కర్స్‌ను గుర్తించి ఇన్సూరెన్స్, పింఛన్ వంటి పథకాలు అమలు చేసి ప్రత్యేక నిధులు కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం ఈ నిధులను వేరే వాటికి మళ్ళించి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్లను నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి పాలకొల్లు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు పులపర్తి సర్వేశ్వరరావు అధ్యక్షత వహించారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్య నిపుణులు

పెంటపాడు, ఫిబ్రవరి 21: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 22న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్టు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, క్యాన్సర్, స్త్రీల వ్యాధులు, చిన్నపిల్లలు, గుండె వైద్య నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్, అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ల్యాబ్‌తో రైతులకు మెరుగైన సేవలు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 21: ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ నిర్మాణంతో ఆక్వా రైతులకు మరింత మెరుగైన సేవలందించవచ్చునని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం ఏఎంసీ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ల్యాబ్ ఏర్పాటు వల్ల అన్ని నాణ్యత పరీక్షలు ఇక్కడే ఆక్వా రైతులు చేయించుకోవచ్చునన్నారు. విత్తనాలు, పురుగు మందులు, మట్టి నమూనాలు వంటి పరీక్షలకు దూర ప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగా పరీక్షలు చేయించుకుని సాగు చేయవచ్చునన్నారు. ఏఎంసీ ఛైర్మన్ రాధాకృష్ణ, ఎంపీపీ సోని, వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, ఏవోలు రాజశేఖర్, రహీమ్ పాల్గొన్నారు.